క్లుప్తంగా

మద్దిలేటి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మద్దిలేటయ్య

బేతంచెర్ల: వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో చైత్రమాసం శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.8,45,711లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

ప్యాపిలి: డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి ప్యాపిలి పట్టణంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించిన ఆయన వసతుల కల్పన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి


అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

బనగానపల్లెరూరల్: మండలంలో నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు అర్చకులు ఎస్పీని పూలమాల దుశ్శాలువేసి ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సర్వసభ్య సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, వ్యవసాయ, పశుపోషణ, గ్రామీణ గృహ నిర్మాణం, మాతా శిశుసంరక్షణ, రెవెన్యూ, వైఎస్సార్ క్రాంతిపథం, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలపై చర్చ సాగుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని మాధవరం గ్రామ సమీపంలోని 11కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం, గార్లదిన్నె, మాధవరం తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అయ్యల చెర్వులో...

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన ఉన్న అయ్యల చెర్వులో విద్యుత్ లైన్ల పనుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ మహబూబ్ వలీ శనివారం తెలిపారు. పరిశ్రమల యజమానులు, ప్రజలు సహకరించాలని కోరారు.

టిప్పర్ స్వాధీనం

డోన్ టౌన్: అధికారుల అనుమతులు లేకుండా ఓవర్‌లోడ్‌తో గ్రావెల్ తరలిస్తున్న టీడీపీకి చెందిన ఓ నాయకుడి టిప్పర్‌ను శనివారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సీసంగుంతల గ్రామ సమీపంలోని కొండల నుంచి గ్రావెల్ లోడ్‌తో పట్టణంలోకి వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఓవర్ లోడ్‌తో గ్రావెల్ తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.



రూ. 4 కోట్లతో డివైడర్‌తోసహా నిర్మించిన సీసీ రోడ్డు, రూ. 50 లక్షలతో పోలీస్ సర్కిల్ కార్యాలయం నుంచి నిర్మించిన సీసీరోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

సీసీరోడ్లు మిలమిల..!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమంతోపాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర వసతులు ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తోంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం రూ. 4.65 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సువిశాలమైన సీసీరోడ్లు నిర్మించారు. దీంతో సీసీ రోడ్లు మిలమిల మెరుస్తున్నాయి. పట్టణంలోని ముదిగేడు చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు రూ. 4 కోట్లతో 700 మీటర్ల మేర డివైడర్‌తో కూడిన విశాలమైన సీసీరోడ్డు ఏర్పాటు చేశారు. అలాగే రూ. 50 లక్షలతో పోలీస్ సర్కిల్ కార్యాలయం నుంచి చమురు బాబయ్య ఇంటి వరకు సీసీరోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. గాంధీనగర్‌లో 300 మీటర్ల మేర రూ. 15 లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు వేయడంతో శాశ్వతంగా రోడ్డు, ట్రాఫిక్ కష్టాలు తొలగిపోయాయి. త్వరలో ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


గాంధీనగర్‌లో రూ. 15 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు, డ్రైనేజీ

– కోవెలకుంట్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ : పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నందునే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ప్రజామోదం ఉందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో శనివారం జరిగిన మండల స్థాయి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి గృహసారథుల బాధ్యతలను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలుతీరు, లబ్ధిపొందిన వివరాలను తెలుసుకోవడమే కాకుండా పథకాలకు ప్రజామోదం ఏ మేరకు ఉందనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ మెటీరియల్‌ను అందజేశారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె: మండలంలోని కటికవానికుంట, ఫతేనగర్ గ్రామాల్లో ఈ నెల 10న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్నాథ్‌రెడ్డి


టీఆర్ జగన్నాథ్ రెడ్డి, అధ్యక్షుడు


జి.విక్రమ్, లైబ్రరీ సెక్రటరీ


ఎస్ అల్లావుద్దీన్, కోశాధికారి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీ.ఆర్ జగన్నాథ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా లైబ్రరీ సెక్రటరీగా జి.విక్రమ్, కోశాధికారిగా ఎస్ అల్లావుద్దీన్ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఖాలీద్‌బిన్ మహమ్మద్, ఉప ఎన్నికల అధికారి విజయభాస్కర్ శనివారం తెలిపారు. ఈ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 3వ తేదీన ప్రారంభవ్వగా 6న ఉపసంహరణ ముగిసింది. ఈ స్థానాలకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు, ఉపాధ్యక్షుడి పదవికి ముగ్గురు సభ్యులు పోటీ చేశారని, ఈ నెల 10వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఖాలీద్‌బిన్ మహమ్మద్, ఉప ఎన్నికల అధికారి విజయభాస్కర్ తెలిపారు. రెండోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న బార్ అసోసియేషన్ సభ్యులకు ఈ సందర్భంగా జగన్నాథ్‌రెడ్డి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలోని శ్మశాన వాటికలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. శివాలయం సమీపంలోని ఓసీ సమాజికవర్గాలకు చెందిన శ్మశాన వాటికలో కంప చెట్లు ఏపుగా పెరిగి అస్తవ్యస్తంగా మారింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు రహదారి సరిగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. రెండు ఎకరాల విస్తీర్ణం ఉన్న శ్మశాన వాటికలో ప్రొక్లెయినర్‌తో కంప చెట్లు తొలగించే పనులు మొదలు పెట్టారు. చదును చేసి గ్రావెల్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే శివాలయం సమీపం నుంచి శ్మశాన వాటిక వరకు దారికి ఇరువైపులా కంప చెట్లు తొలగించి బాగు చేయనున్నారు.


ప్రొక్లెయినర్‌తో కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

సంజామల(కోవెలకుంట్ల): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా 32 రకాల సంక్షేమ పథకాలను వర్తింపచేస్తోందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం సంజామల మండలం నొస్సం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటినీ సందర్శించారు. కుటుంబ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. అలాగే పేరుసోముల గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు చిన్నబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.


కుటుంబ యజమాని అభిప్రాయాలతో ప్రశ్నావలిని నింపుతున్నమల్కిరెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్యాపిలి: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణ మూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ప్యాపిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాల సభ్యులతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. యాజమాన్యాల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసినందునే ప్రతి ఇంటికీ సగర్వంగా వెళ్లగలుగుతున్నామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ప్రజలకు తమ ప్రభుత్వం పట్ల విశ్వాసం ఉన్నందునే తమ ఇంటికి స్టిక్కర్లు అతికించేందుకు అనుమతి ఇస్తున్నారని చెప్పారు.


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రక్త దానం

డోన్ టౌన్: అరుదైన ఓ నెగిటివ్ రక్తం అవసరం కావడంతో స్పందించిన పట్టణానికి చెందిన యువకుడు షేక్ మహమ్మద్ రఫీ రక్త దానం చేసారు. గూడూరు మండలం పెంచికల పాడు గ్రామ సమీపంలోని విశ్వభారతి వైద్యశాలో ఒక వ్యక్తికి శస్త్ర చికిత్సల నిమిత్తం ఓ నెగిటివ్ రక్తం అవసరమని వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ వచ్చింది. ద్రోణాచలం సేవా సమితి గ్రూపులు గమనించి సభ్యుడు గురుస్వామి మిత్రుడైన మహ్మద్‌రఫీకి సమస్యను వివరించి బైక్‌పై ఆసుపత్రికి వెళ్ళి రక్త దానం చేయించాడు. మహ్మద్‌రఫీతోపాటు గురుస్వామికి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పలపాడులో తీరిన తాగునీటి కష్టాలు

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో త్రాగునీటి కష్టాలు తీరాయి. కోటవీధి ప్రజలు కొన్నేళ్లుగా తీవ్రమైన త్రాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. సమస్యను గత నెలలో ఆ కాలనీ ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా సూర్య ప్రకాశ్‌రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.9లక్షలు సొంత నిధులను వెచ్చించి గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి కోటవీధి వరకు దాదాపు 1.5కిలోమీటర్ పైప్‌లైన్ వేయించారు. ఈ మేరకు శనివారం అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు పూజ కార్యక్రమం నిర్వహించి కుళాయిలకు తాగునీటిని వదిలారు. దీంతో కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఉప్పలపాడు, జునూతల, కొండమనాయునిపల్లె గ్రామాల్లో తన సొంత నిధులతో శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేస్తానని, కొడమీది గ్రామాల ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, గంగాధర్, సికింధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


నీటి సరఫరా తీరును పరిశీలిస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

● అర్హతే ప్రామాణికంగా వర్తింపు
● ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. మండల పరిధిలోని ఇటిక్యాలలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు కాటసాని అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేసి చూపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందజేశామని, ఆ విషయాలు నేరుగా తెలుసుకునేందుకే మీ ముందుకు వచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబానికి లక్షల్లో లబ్ధి జరగడంతో జగనన్నపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన, మన ప్రభుత్వ పాలన వ్యత్యాసాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని విన్నవించారు. గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించడం చరిత్రాత్మకమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు సూరపురెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పులి ప్రకాష్‌రెడ్డి, మూల ఈశ్వరరెడ్డి,పెద్ద బొజ్జయ్య, ఓబులేసు, నరసింహుడు, ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న అంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే మీ ముందుకు..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటిక్యాలలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతోపాటు ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామని తెలిపారు. కాలనీల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా రూ.51 లక్షలతో రోడ్లు వేసేందుకు నివేదికలు తయారు చేశామని, త్వరలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కోళ్ల ఫారం కాలనీలో ఇటీవలనే సుశీలమ్మ అనే వృద్ధురాలు చెట్టు కొమ్ము కొట్టే సమయంలో 33/11 కెవి విద్యుత్ తీగలపై పడటంతో మృతి చెందిందని, గతంలోనూ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని స్థానికులు ఎమ్మెల్యేకు తెలుపగా ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లి లైన్ మార్పు చేయిస్తామని హామీ ఇచ్చారు.

14న అంబేడ్కర్ జయంతి మహాసభ

బనగానపల్లెరూరల్: భారత్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి మహాసభను ఈ నెల 14న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలంగాణా, ఏపీ రాష్ట్రాల మాలమహా నాడు ఉపాధ్యక్షుడు గడ్డం నాగముని శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పాదుపు భవనంలో నిర్వహించే ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యమలా సుదర్శనం, రాయలసీమ మాలమహానాడు అధ్యక్షుడు టి.రంగయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుగొట్టి బాలయ్య హాజరవుతారన్నారు. మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయంతి మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సత్తా చాటిన అనంతపురం జిల్లా వృషభాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని న్యూ కేటగిరి బండలాగుడు పోటీలను నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా, ఉబ్బు చెర్ల గ్రామం గోవిందు వృషభాలు మొదటి స్థానంలో నిలువగా నంద్యాల మండలం, కానాల గ్రామం గుండం చెన్నారెడ్డి వృషభాలు రెండవ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా ఓర్వకల్లు మండలం, హుస్సేనాపురానికి చెందిన రామ సుబ్బారెడ్డి వృషభాలు మూడు, నాలుగు స్థానాలను కై వసం చేసుకున్నాయి. విజేత వృషభాల యాజామాన్యాలకు వరుసగా రూ. 50 వేలు, రూ, 35 వేలు, రూ.20 వేలు, రూ. 10 వేలు చొప్పున అందజేశారు.

అదనపు కట్నం కేసు నమోదు

డోన్ టౌన్ : అదనపు కట్నం కోసం భర్త, అత్తతో పాటు భావలు వేధిస్తున్నారని కొత్తబురుజు గ్రామానికి(పుట్టినిల్లు) చెందిన పుష్పలత శనివారం రూరల్ పోలీసులకు పిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పుష్పలతను కడప జిల్లా మైలవరం మండలం బెస్తవేముల గ్రామానికి చెందిన లక్ష్మీరాముడుకు ఇచ్చి 2021లో పెద్దలు వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో కట్నకానుకల కింద ఆరు తులాల బంగారం, రూ. 50వేలు ఇచ్చినట్లు తెలిపారు. అయితే పెళ్ళైన కొన్ని నెలలకే డబ్బుల అవసరం ఉంది తేవాలంటూ వేధిస్తున్న భర్త, అత్తకు ముగ్గురు భావలతోపాటు మరో బంధువు మద్దతు తెలుపుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రైతు భరోసా మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలో కొత్తగా పాస్ బుక్కు వచ్చిన రైతులు ఈ సంవత్సరం రైతు భరోసా మంజూరుకు ఆర్బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఎవరైనా రైతు చనిపోయిన ఉంటే, నామినీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

శ్రీమద్దిలేటి స్వామి ఆలయ తలుపుల ఏర్పాటుకు రూ. 2లక్షల విరాళం

బేతంచెర్ల: మద్దిలేటిస్వామి క్షేత్రంలో ఆలయంలో పునర్నిర్మిస్తున్న స్వామివారి ఆలయ తలుపుల ఏర్పాటుకు శనివారం దాతలు రూ.2లక్షల విరాళం అందజేశారు. కర్నూలు మండలం, నందనపల్లె గ్రామానికి చెందిన ఈడిగ రేణుకాదేవి జ్ఞాపకార్థం భర్త ఆంజనేయులు గౌడు, కుమారులు శరణ్ గౌడు, డాక్టర్ బాల కృష్ణ గౌడు రూ. 2లక్షల చెక్కును ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడికి అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి పట్టువస్త్రంతో దాతలను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

కేసుల పరిష్కారంలో చొరవ చూపాలి

డోన్ టౌన్: కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపి ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పోలీసులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం డోన్, ప్యాపిలి సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్ల అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, ఎఫ్ఐఆర్‌ల వివరాలు, చార్జ్‌షీట్ల దాఖలు, ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలు విచారణపై ఆరా తీశారు. అదేవిధంగా రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో డోన్, ప్యాపిలి సీఐలు శేషయ్య, శ్రీరాములు ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డీఎస్పీ

గరుడవాహనంపై చెన్నకేశవస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవ స్వామిని గరుడ వాహనంపై పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన మహామంగళ హారతి నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి గౌరిపేట, హనుమాన్‌నగర్, సంజీవనగర్, దేవుని రస్తా, బోయపేట కూరగాయల మార్కెట్ మీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈవీ సుజాత శర్మ, శ్రీధర్‌రెడ్డి, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, వీరారెడ్డి, భజన కృష్ణయ్య, రమణ, మారుతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా చేయిస్తాం

డోన్ : పట్టణంలోని కొండపేట, చిగురుమానుపేట, జెండాకట్ట వీధి ప్రాంతాలకు పదిరోజులపాటు మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, అయితే ట్యాంకర్లతో సరఫరా చేయిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. పేరంటాలమ్మ గుడి వద్ద గల పంప్‌హౌస్‌లో 75 హెచ్‌పీ పంప్‌సెట్ మరమ్మతుల కారణంగా మంచినీటి సరఫరాకు పైప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. శనివారం పంప్‌హౌస్‌ను సందర్శించి మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేయించి మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చైర్మన్ తెలిపారు.


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రాజేష్

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాల్గు సంవత్సరాల కాలంలో ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ మధు అన్నారు. శనివారం నగర పంచాయతీలోని బుగ్గానిపల్లె, పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లు వలీబాషా, సాయికిరణ్, అమ్మని, గృహ సారథులు, వలంటీర్ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యకక్రమం ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వం, వైఎస్సార్ ప్రభుత్వానికి తేడాను గమనించాలని ప్రజలకు విన్నవించారు. ఆయా కుటుంబాల యాజమాన్యాల అనుమతితో వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు.


బుగ్గానిపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం